

కొడంగల్ : హస్నాబాద్ గ్రామంలోని పల్లె ప్రకృతి వనం..



యాలాల్: కోకట్ పల్లెప్రకృతి వనంలో విద్యార్థులకు విద్యాభ్యాసం చేస్తున్న దృశ్యం



వికారాబాద్‌లోని నారాయణపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం



ధారూరు మండలంలోని దోర్నాల్‌లో..



మర్పల్లి: రావులపల్లి బృహత్ పల్లె ప్రకృతి వనం

# పల్లెలు పచ్చగా..

**పల్లె ప్రకృతి వనాలతో గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం**

**పార్కుల్లో సేదతీరుతున్న జనం**

**వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటు**

**జిల్లాలోని 566 గ్రామ పంచాయతీల్లో పల్లెప్రకృతివనాలు**

**ఒక్కో పల్లెప్రకృతి వనానికి రూ.9 నుంచి 10 లక్షలు ఖర్చు చేసిన ప్రభుత్వం**

వికారాబాద్, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతి వనాలతో పల్లెల్లో చాలా మార్పు వచ్చింది. పల్లెలన్నీ పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. పల్లెప్రకృతివనాలతో గ్రామాలన్నీ పచ్చని చెట్లతో హరితశోభితను సంతరించుకున్నాయి. గామీణ ప్రాంత ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకుగాను ప్రభుత్వం పల్లెప్రకృతివనాలను ఏర్పాటు చేసింది. ఒకప్పుడు నగరాలు, పట్టణాలకే పరిమితమైన పార్కులు ప్రస్తుతం గ్రామాల్లోనూ ఏర్పాటయ్యాయి. ప్రతి పల్లె పచ్చని వనంలా మారిపోయింది. గ్రామాల మధ్యలో పల్లెప్రకృతివనాలుండడంతో ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడింది. వాకింగ్ ట్రాక్‌లతో ప్రజలంతా వాకింగ్ చేస్తూ ఆరోగ్యంపై దృష్టి సారిస్తున్నారు. భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి కేసీఆర్ మహోత్తర కార్యక్రమాలు చేపట్టడంపై ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**హరితవనంలా గ్రామాలు..**

పల్లెప్రకృతి వనాలతోపాటు ప్రతీ గ్రామమంతా మొక్కలు నాటడంతో గ్రామాలన్నీ హరితవనంలా కనిపిస్తున్నాయి. జిల్లాలోని 566 గ్రామ పంచాయతీల్లో పల్లెప్రకృతివనాలను ఏర్పాటు చేశారు. ప్రతి పంచాయతీలో పల్లెప్రకృతి వనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఒక్క ఎకరా స్థలంలో 4వేల మొక్కలతో చిట్టడవులను ఏర్పాటు చేశారు. పల్లెప్రకృతి వనానికిగాను మొక్కలు, వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటుకుగాను ప్రభుత్వం రూ.9 లక్షలను ఖర్చు చేసింది. పల్లె ప్రకృతి వనాల్లో పొడువు జాతి, చిన్న జాతి మొక్కలతోపాటు ఔషధ మొక్కలను నాటారు. వేప, ఇప్పా, నెరపి, గంధం, టేకు, పొంగామియా, కుంకుడు, ఉసిరి, మారేడు, చింత, పనస, అందుగ, సీమచింత, మెహందీ, సీతాఫల్, జామ, దానిమ్మ, కరివేప, నిమ్మ, తాటిచెట్టు, మల్బరీ, వెదురు, జమ్మి, వావిల్లి మొక్కలను నాటారు. ప్రజలు వాకింగ్ చేసేందుకు వాకింగ్ ట్రాక్‌లను కూడా ఏర్పాటు చేశారు. వాకింగ్ ట్రాక్‌కు చుట్టూ తంగేడు, అద్దసారం, పారిజాతం, తిప్ప తీగ, పొడపత్రి, పెద్ద నిమ్మ మొక్కలను నాటారు. ప్రతి గ్రామ పంచాయతీకి కేటాయించిన 10శాతం గ్రీన్ బడ్జెట్ నుంచి ప్రకృతి వనాలకు ఖర్చు చేశారు.




కులకచర్ల మండలం తిర్మలాపూర్ పల్లె ప్రకృతివనం



కులకచర్ల : పుట్టపహాడ్‌లో పల్లెప్రకృతివనంలో మొక్కలు



యాలాల్ మండలంలోని దేవనూర్ పల్లెప్రకృతి వనం



కులకచర్ల : కుస్మసముద్రం పల్లె ప్రకృతి వనం



ధారూరు : కెరెళ్లి గ్రామం



కొడంగల్: పర్సాపూర్ గ్రామ పల్లె ప్రకృతి వనం



నవాబుపేట : యెల్లకొండ పల్లెప్రకృతివనంలో ఏపుగా పెరిగిన మొక్కలు




కొడంగల్ : ఖాజాఅహ్మద్‌పల్లి గ్రామంలోని పల్లె ప్రకృతి వనం



వికారాబాద్ మండలం కామారెడ్డిగూడ పల్లె ప్రకృతి వనం

## ప్రజల చైతన్యంతోనే తెలంగాణ అభివృద్ధి

**రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గనుల శాఖల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి**



మద్దూర్ మండలంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఎడ్లబండిపై మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్, అక్టోబర్ 31: ప్రజల చైతన్యంతోనే తెలంగాణ అభివృద్ధి ఆధారపడి ఉందని రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గనుల శాఖల మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గం మద్దూర్ మండలంలోని పెదిరిపాడు, చెన్నారెడ్డిపల్లి, మోమినాపూర్ తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి మంగళవారం రాత్రి వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్‌ను నమ్ముకుంటే వ్యవసాయానికి 3 గంటల కరెంటు మాత్రమే మిగులతుందని, కేసీఆర్‌తో 24 గంటల నాణ్యమైన కరెంటు సరఫరాతో పండుగలా వ్యవసాయం చేసుకునే ఆస్కారం ఉంటుందన్నారు. పంట పెట్టుబడితో పాటు కుటుంబానికి భరోసాగా రైతుబీమా వంటి సదుపాయాలను కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్‌కు తగ్గట్టుగా పిట్టకథలు చెప్పే రేవంత్ తోడైయ్యాడని, కాంగ్రెస్ 6 గ్యారెంటీలు చెల్లుబాటు అయ్యే ప్రసక్తి లేదన్నారు. కర్ణాటకలో కూడా గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రజలను కాంగ్రెస్ నమ్మబలికిందని, నేడు కన్నడ ప్రజలు కాంగ్రెస్ పై దుమ్మెత్తి పోస్తున్నట్లు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమానికి పాటుపడుతుంటే.. కాంగ్రెస్ ప్రజాసంక్షమ పథకాలను అమలు కాకుండా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు అందించిందన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతో అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉందని, సీఎం కేసీఆర్ కొడంగల్ నియోజవకర్గ అభివృద్ధికి వందల కోట్ల నిధులు మంజూరుతో ప్రతి గ్రామానికి రోడ్లు, తాగునీరు వంటి ఎన్నో సదుపాయాలు అందుబాటులోకి వచ్చినట్లు గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో వచ్చే కాంగ్రెస్ నాయకులకు ప్రజలో బుద్ధి చెప్పాలని కోరారు. ఓటమి భయంతో నియోకవర్గంలో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులను కొనుగోళ్లు చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తుందని, డబ్బుకు అమ్ముడుపోయే వారికి ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. బీఆర్ఎస్‌కు మరో మారు అవకాశాన్ని కల్పిస్తే మరింత అభివృద్ధి చేసి ప్రజాసేవకు అంకితమౌతానని హామీ ఇచ్చారు. అభివృద్ధిని ఆకాంక్షించి గ్రామ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీలో చేరుతుండటం చాలా సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు మోసపూరితమైన మాయా జాలంలో పడవద్దని, ఎన్నికల సమయంలోనే సమన్వయంతో కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో పాటు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.